ఢిల్లీకి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

- ముగిసిన శీతాకాల విడిది

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ శీతాకాల విడిది ముగిసింది. ఈనెల 17న హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 19న రామోజీఫిల్మ్ సిటీలో నిర్వహించిన పబ్లిక్ సర్వీస్ కమిషన్ (పిఎస్‌సి) చైర్‌పర్సన్ల జాతీయ సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 20న గచ్చిబౌలిలో బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. 21న బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఎట్‌హోమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరు రోజుల శీతాకాల విడిది ముగించుకున్న రాష్ట్రపతి, సోమవారం హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ పయనమయ్యారు. ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాలరావు, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె రామకృష్ణారావు తదితరులు వీడ్కోలు పలికారు.

కైట్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు చేయండి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్రాంతి పండుగ సందర్భంగా సికింద్రాబాద్‌లోని పరేడ్‌గ్రౌండ్‌లో జనవరి 13 నుంచి 15 వరకు జరిగే అంతర్జాతీయ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌కు అన్ని ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కైట్ ఫెస్టివల్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహిస్తున్నామని తెలిపారు. సరైన పేరు, ప్రత్యేక బ్రాండింగ్, ఆకర్షణీయమైన లోగోను రూపొందించాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సారి కైట్ ఫెస్టివల్‌ను హైడ్రా ద్వారా పునరుజ్జీవించబడిన చెరువుల వద్ద నిర్వహించనున్నట్టు తెలిపారు.

'ఉపాధి' చట్టం మోడీ సర్కారుకిష్టం లేదు

- వామపక్షాలతో ఒత్తిడితో వచ్చినది కాబట్టే నిర్వీర్యానికి యత్నం
- ఉపాధి చట్టం పునరుద్ధరణకు కోసం ఐక్య పోరాటాలు : బివి రాఘవులు
- నరేగా చట్టం తీసుకురావడంలో ఏచూరి పాత్ర కీలకం : నారాయణ
- సికింద్రాబాద్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యుపిఎ -1 ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడితో తీసుకొచ్చిన ఉపాధి హామీ చట్టం ఉండటం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఇష్టం లేదనీ, అందుకే ఆ చట్టం నిర్వీర్యానికి మోడీ సర్కారు పూనుకున్నదని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు విమర్శించారు. చట్టం తీసుకొచ్చే సమయంలో ప్రజల్లోగానీ, పార్లమెంట్‌లోగానీ సమగ్ర చర్చకు పెట్టకపోవడం దుర్మార్గమన్నారు. నరేగా చట్టం తీసుకొచ్చే సమయంలో ఏడాది పాటు ప్రజల్లో చర్చకు పెట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ఆనాడు పార్లమెంట్‌లో వామపక్షాల ఎంపిలు బలమైన చర్చపెట్టి ప్రజలకు అనుకూలమైన చట్టం తీసుకొచ్చారని వివరించారు. వామపక్ష పార్టీల ముద్ర బలంగా ఆ చట్టం ఉండటం బిజెపికి ఏమాత్రం ఇష్టంలేదన్నారు. మరోవైపు స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను కూడా క్రమంగా లేకుండా పోతున్నదనీ, మహాత్మాగాంధీ పేరు ఉండటం ఆ పార్టీకి ఏమాత్రం ఇష్టం లేదని విమర్శించారు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం 'విబి జి రామ్ జి' చట్టాన్ని తీసుకురావడాన్ని నిరసిస్తూ సోమవారం సికింద్రాబాద్ ఎంజీ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్రం తీసుకొచ్చిన చట్టాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలనీ, పాత చట్టాన్ని కొనసాగించాలని, గాంధీ పేరును మార్చొద్దని నినదించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ..కూలీలు అధిక వేతనం పొందడం, కొంత మేర జీవప్రమాణాలు మెరుగుపడడం గ్రామీణ ధనవంతులకు, కార్పొరేట్లకు ఏమాత్రం నచ్చడం లేదనీ, అందుకే ఆ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ఒత్తిడి తీసుకురావడంతోనే మోడీ సర్కారు ఇలా చేస్తున్నదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టంలో కేంద్రం వాటాను తగ్గించి రాష్ట్రాల వాటా పెంచడం అంటే భారం మోపడమేనని, ఇప్పటికే రాష్ట్రాల ఆర్థిక వనరులపై దాడిచేస్తూ మున్సిపాల్టీల స్థాయికి మోడీ దిగజార్చిన విధానాన్ని వివరించారు. వేతనాన్ని ఏడు రోజుల్లోనే చెల్లింపు, 125 రోజులకు పని పెంపు అంటూనే పెద్ద ఎత్తున కూలీలను ఉపాధి హామీ చట్టం నుంచి తొలగించే పనికి మోడీ సర్కారు పూనుకున్నదని విమర్శించారు. 125 రోజుల పని అని చెబుతూ విషగుళికను మింగించే పనిలో ఉందన్నారు. పేదలకు ఇతోధికంగా దోహదపడుతున్న ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం ఐక్య పోరాటాలు చేయనున్నట్టు ప్రకటించారు. రాజకీయంగా క్షేత్రస్థాయికి ఉద్యమాన్ని తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నా పట్టనట్టు ఉంటున్న బిజెపి, టిడిపి, వైసిపి, జనసేన, బిఆర్ఎస్, తదితర ప్రాంతీయ పార్టీలకు చెందిన నేతలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. అందర్నీ సమీకరిద్దాం..పోరాటాల ద్వారా ముందుకెళ్దాన్నారు.

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె నారాయణ మాట్లాడుతూ.. పార్లమెంట్ వామపక్షాల బలం తగ్గితే సామాన్యులకు,పేదలకు నష్టమనీ, లౌకిక వ్యవస్థలకు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని చెప్పారు. పార్లమెంట్ వామపక్షాలకు బలమైన ప్రాతినిధ్యం ఉంటే కేంద్రం ప్రవేశపెట్టిన 'విబి జి రామ్ జి' బిల్లును బలంగా అడ్డుకునేవారని, ఇప్పుడు ఆ లోటు కనబడుతున్నదని కొందరు కాంగ్రెస్, బిజెపి ఎంపిలు అంటున్నారని ప్రస్తావించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును విబిజి రామ్ జి గా మార్చి గాంధీని మరోమారు మోడీ హత్య చేశారని తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. స్వాతంత్య్ర, పోరాట యోధులను వెనక్కి నెట్టి, గాంధీని చంపిన గాడ్సేను, బ్రిటీషర్లను క్షమాభిక్ష కోరిన సావర్కర్‌లను ముందుకు తీసుకొస్తున్నారని విమర్శించారు. మోడీఅధికారంలోకి వచ్చిన 2014 తర్వాతనే భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చినట్టుగా కొందరు బిజెపి ఎంపిలు మాట్లాడటాన్ని తప్పుబట్టారు. నరేగా చట్టం తీసుకొచ్చే సమయంలో అప్పటి సిపిఎం ఎంపి సీతారాం ఏచూరి కీలక భూమిక పోషించారని గుర్తుచేశారు. దురుద్దేశంతో మంచి చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి మోడీ సర్కారు పూనుకోవడాన్ని తప్పుబట్టారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ..నూతన చట్టం కేంద్రం నిధులను తగ్గించి రాష్ట్రాలపై భారాన్ని మోపడం సరికాదన్నారు. పనిముట్ల కొనుగోలు ఖర్చులను కూడా 75 శాతం రాష్ట్ర ప్రభుత్వాలే భరించాలని కొత్త చట్టంలో పేర్కొనటం దారుణమన్నారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, రోజువారీ కూలిని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ఉపాధి హామీ పరిరక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష పార్టీల నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయనీ, మంగళవారం జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు మాట్లాడుతూ..మోడీ, బిజెపికి శ్రీరామునిపైన భక్తి లేదనీ, శ్రీరాముని కేవలం అధికారానికి మాత్రమే ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. బిజెపి నేతలకు సావర్కర్, గాడ్సేలే నిజమైన దేశభక్తులన్నారు. సిపిఐ న్యూడెమోక్రసీ నేత ఆవాల పాపన్న మాట్లాడుతూ కేంద్రం పేదల పొట్టకొడుతోందని విమర్శించారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కన్వీనర్ జోగిరెడ్డి మాట్లాడుతూ..ఉపాధి రక్షణ కోసం అందరం కలిసికట్టుగా పోరాటం చేయాలని, అందుకు గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలను ఐక్యం చేయాలని కోరారు.

సిపిఎం నగర కార్యదర్శి ఎం.వెంకటేశ్, సిపిఐ నగర కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, మల్లయ్య, అబ్బాస్, సీనియర్ నేత డిజి నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రసాద్, శ్రీరాంనాయక్, స్కైలాబ్‌బాబు, అరుణజ్యోతి, ఆశయ్య, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటీ నర్సింహ్మా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ చాయాదేవి, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కార్యదర్శి పి.ప్రేమపావని, నాయకులు కమతం యాదగిరి, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు అన్వేష్, ఎస్ఎల్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో డ్రగ్స్ పట్టివేత

హైదరాబాద్ బ్యూరో : రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధి అంజయ్యనగర్‌లోని కో లివింగ్ హాస్టల్లో డ్రగ్స్ దందా మరోసారి వెలుగు చూసింది. కో లివ్ గెర్నట్ పిజిలో ఎస్ఒటి పోలీసులు సోమవారం డ్రగ్స్ పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కో లివింగ్ హాస్టల్‌లో డ్రగ్స్ ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే హాస్టల్‌పై దాడి చేశారు. ఎపికి చెందిన వంశీ దిలీప్, బాల ప్రకాశ్.. బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ సరఫరా చేస్తున్నారు. వీరు హైదరాబాద్‌కు చెందిన రోహిత్, తరుణ్‌కు విక్రయించారు. ఈ క్రమంలో డ్రగ్స్ దందా సాగుతున్నట్టు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు హాస్టల్‌పై దాడి చేసి మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 12 గ్రాముల ఎండిఎంఎ, ఏడు గ్రాముల ఓజీ కుష్, ఆరు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

IN THE COURT OF MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL CUM 7th A.D.J. MADANAPALLE
M.V.O.P.No. 84/2022

B.A.Mohammed Touheer. ...Petitioner
Vs
K.Lakshmi praveena and others. ...Respondents

NOTICE TO R1

K.Lakshmi praveena, W/o K.Raghavendra, Owner of Car No. AP-28-DX-3625, D.No.8-145-20,1st floor, Allwyn colony, Ranga reddy district, Telangana State.

Madam, Please take notice that the above case is posted on 31/12/2025 for your appearance, appear either in person or through an advocate, failing which the matter will be decided exparte.

//By Order of the Court//

R.SHAJAHAN, B.Com., B.L.,
Advocate & Notary,
MADANAPALLE.

శ్రీ మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తెనాలి
ఓయస్ నెం.605/2022

అనంతగిరి శ్రీనివాసరావు .... వాది
ఎదిరి
అనంతగిరి సోమయ్య (డైడ్) 7 ఇతరులు ...ప్రతివాదులు

టు:
అనంతగిరి వెంకట శివప్రసాద్, తండ్రి సోమయ్య, 65 సంగలు, రిటైర్డు పోలీసు, వనస్థలిపురం, హైదరాబాదు, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ.

సదరు పై నెంబరు గల దావా నందు మీరు 5వ ప్రతివాది అయి వున్నారు. మీకు కోర్టు వారు 1. ఐ.ఎ. నెం.601/2025–డిలే కండోన్ పిటీషన్ 2. ఐ.ఎ.నెం. 602/2025– సెట్‌సైడ్ ది ఎబట్‌మెంట్ పిటీషన్, 3. ఐ.ఎ.నెం.603/2025–యాడింగ్ ఆఫ్ యల్.ఆర్స్ ల పిటీషనుకు సంబంధించిన నోటీసులు పంపినను మీరు తీసుకొనక, జారీ అవ్వక, కాలయాపన జరుగుచున్నందున శ్రీ కోర్టు వారి ఆర్డరు ప్రకారం 5వ ప్రతివాది అయిన మీకు ఎవరు ప్రకటన ద్వారా కోర్టు నోటీసు ది.06-01-2026 వాయిదా గలదని తెలియజేయడమైనది. సదరు వాయిదా ది.06-01-2026న 5వ ప్రతివాది అయిన మీరు కాని, లేక మీ అడ్వకేట్ గారి ద్వారా గాని పై తెల్పిన కోర్టులో ఉదయం 10-30 నిఎలకు హాజరు కావలెను, కానిచో మిమ్ములను కోర్టు వారు పిలిచి మీ పరోక్షమున దావాను తీర్మానించి తదుపరి ఉత్తర్వులు జారీ చేయబడునని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

తెనాలి
వాయిదా తేది. 06-01-2026

జి. ప్రభాకరరావు,
వాది తరపు న్యాయవాది,
కొత్తపేట, తెనాలి.
సెల్ నెం. 9440039009

మహారాజశ్రీ పర్చూరు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
I.A.No. 250/2025
O.S.No. 59/2018

దగ్గుబాటి సీతారామాంజనేయులు - వాది / పిటిషనరు
వర్సెస్
1. గుజ్జ సంపత్ రావు (డైడ్)
2. యార్లగడ్డ అనిత
మరియు ఇతరులు - ప్రతివాదులు / రెస్పాండెంట్స్

To,
R5. శ్రీమతి **ఆర్.ఉషారాణి, భర్త మహేందర రావు,** R/o ప్లాట్ నెం. 2805, టవర్స్ 11 మరీనా స్కైస్ గిన్ హిల్స్ రోడ్డు, మూసాపేట, హైదరాబాదు, తెలంగాణ స్టేట్, సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్.

పై నెంబరు పిటిషన్‌ను పిటిషనరు శ్రీ కోర్టు వారి ఎదుట దాఖలు చేసుకొనగా మొదటి ప్రతివాది మరణానంతరం మిమ్ములను వారసులుగా ఐదో ప్రతివాదిగా సదరు పిటిషనరు పొందుపరచి నాడు దరిమిలా శ్రీ కోర్టు వారు సదరు విషయమై మీకు అనేక పర్యాయములు సమన్లు పంపించినను మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచుండగా సదరు విషయమై కోర్టు వారు వారసులుగా గురించి పేపర్ ప్రకటన వేయవలసిందిగా ఆర్డర్ వేసి ఉన్నారు. **వాయిదా తేది: 30-12-2025 న ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెయును. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించెదురని తెలియజేయడమైనది.

//శ్రీ కోర్టు వారు ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 30-12-2025

ఇట్లు
కట్టా సాల్మన్
అడ్వకేట్, పర్చూరు, బాపట్ల జిల్లా.

విద్యుత్ ఉద్యోగులకు 17.651 డిఎ

- ప్రతిపాదనలకు ఆమోదం తెలిపిన ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ ఉద్యోగులకు 17.65 శాతం డిఎ ఖరారు చేస్తూ విద్యుత్ శాఖ రూపొందించిన ప్రతిపాదనలకు డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం ఆమోదం తెలిపారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న ధరల సూచి ఆధారంగా ప్రతి సంవత్సరం డియర్‌నెస్ అలవెన్స్ (డిఎ) డియర్‌నెస్ రిలీఫ్ (డిఆర్)ను సమీక్షిస్తారు. అందులో బాగంగా ఈ ఏడాది 1జులై 2025 నుంచి అమలయ్యేలా ఉద్యోగులు, ఆర్టిజన్లకు డిఎ, డిఆర్‌ను ఖరారు చేశారు. తాజా ఉత్తర్వులతో విద్యుత్ సంస్థల పరిధిలో పని చేస్తున్న 71,387 మంది ఉద్యోగులు, పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు. పెంచిన డిఎ ప్రకారం టిజి ట్రాన్స్‌కోలో పని చేస్తున్న 3,036 మంది ఉద్యోగులు, 3,769 మంది ఆర్టిజన్లకు, 2,446 మంది పెన్షనర్లకు మొత్తంగా 9,251 మందికి ప్రయోజనం చేకూరనుంది. తెలంగాణ జెన్కోలోకు చెందిన 14,075 మంది లబ్ది పొందుతారు. ఇందులో 6,913 ఉద్యోగులు, 3,583 మంది ఆర్టిజన్లు, 3,579 మంది పెన్షనర్లు ఉన్నారు. ఎస్‌పిడిసిఎల్‌లో 11,957 మంది ఉద్యోగులు, 8,552 మంది ఆర్టిజన్లు, 8,244 మంది పెన్షనర్లకు మొత్తంగా 28,753 లబ్ది చేకూరనుంది. ఎన్‌సిపిడిసిఎల్ పరిధిలో 9,728 మంది ఉద్యోగులు, 3,465 మంది ఆర్టిజన్లు, 6,115మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరనుంది.

స్కాలర్‌షిప్ బకాయిలు
రూ.365.75 కోట్లు విడుదల : భట్టి

రాష్ట్రంలో సంక్షేమ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న బకాయిలు రూ.365.75 కోట్లు విడుదల చేశామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిలను మంజూరు చేశామని పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు ప్రయోజనం కలిగేలా ప్రజాప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ విద్య విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడబోదని స్పష్టం చేశారు. కేవలం విద్యతోనే సమాజంలో సమూల మార్పులు వస్తాయని తెలిపారు. స్కాలర్‌షిప్ బకాయిలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖలకు సంబంధించి రూ.365.75 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. ఇందులో బిసి సంక్షేమ శాఖకు రూ.21.62 కోట్లు, ఎస్‌సి సంక్షేమ శాఖకు రూ.191.63 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు రూ.152.59 కోట్లు విడుదల య్యాయని వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

అటవీ అధికారుల సంయుక్త కృషితోనే
సాహెబ్‌నగర్ కలాన్ సక్సెస్

- పిసిసిఎఫ్ డాక్టర్ సువర్ణ

హైదరాబాద్ బ్యూరో : తెలంగాణ అటవీ అధికారుల సంయుక్త కృషితోనే సాహెబ్‌నగర్ కలాన్ సక్సెస్ అయిందని తెలంగాణ అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (పిసిసిఎఫ్) డాక్టర్ సువర్ణ తెలిపారు. ఈ కేసులో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వం, సిఎం, అటవీ శాఖ మంత్రి, న్యాయశాఖ ఇచ్చిన సహకారం మరువలేనిదని ఆమె కృతజ్ఞతలు తెలిపారు. సాహెబ్‌నగర్ కలాన్ కేసులో కృషి చేసిన అధికారులు, మాజీ ఉద్యోగులు, సహాయక సిబ్బందిని సోమవారం హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కులో ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సువర్ణ మాట్లాడుతూ ఈ కేసు తన హయాంలో విజయవంతంగా ముగియడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసు చాలా ఏళ్ల క్రితం ప్రారంభమైందని తెలిపారు. దీర్ఘకాల న్యాయ పోరాటంలో అటవీ శాఖకు అండగా నిలిచిన అధికారులు, సిబ్బంది, ఉద్యోగుల కృషిని ఆమె అభినందించారు. అలాగే న్యాయవ్యవస్థ న్యాయం నిలబెట్టినందుకు, పర్యావరణ అంశాలను బాధ్యతగా వెలుగులోకి తీసుకువచ్చిన మీడియాకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసులో కీలక పాత్ర పోషించిన రిటైర్డ్ సిసిఎఫ్ బుచ్చిరెడ్డితో పాటు, రికార్డుల సంరక్షణలో సహకరించిన ఇతరులను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా కేబీఆర్ నేషనల్ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో, కేసు విజయంలో భాగస్వాములైన అధికారులు, మాజీ ఉద్యోగులు, సహాయక సిబ్బందిని సన్మానించారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించిన భూమి అటవీ శాఖదే అని సుప్రీంకోర్టు స్పష్టంగా తీర్పు ఇచ్చిందని సువర్ణ స్పష్టం చేశారు. ఈ తీర్పు అటవీ సంరక్షణకు, చట్ట పరిరక్షణకు ఒక గొప్ప విజయమనీ, భవిష్యత్ తరాల కోసం అటవీ సంపదను కాపాడే దిశగా ఇది కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు.

నేనే గెలిచా.. నేనే సర్పంచ్‌ని..

- ఒక్క ఓటుతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి ఫ్లెక్సీలు

హైదరాబాద్ బ్యూరో : ప్రజాస్వామ్యబద్ధంగా నేనే గెలిచా.. అధికార పార్టీ వారు అధికార దుర్వినియోగం చేసి ప్రకటించుకున్న గెలుపు గెలుపు కాదు.. గ్రామానికి సర్పంచ్ నేనే అంటూ.. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చిన్ననారాయణపురం గ్రామంలో ఒక్క ఓటుతో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి జంగిలి అనిత సోమవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గెలిచిన వార్డు సభ్యుల ఫొటోలతో కలిపి పెట్టిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. ఇది గమనించిన గ్రామస్తులు పోలీసులకు, అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఆ ఫ్లెక్సీలను తొలగించాలని బిఆర్ఎస్ నాయకులపై ఒత్తిడి తేవడంతో ఘర్షణ వాతావరణ ఏర్పడింది. పోలీసులు గ్రామానికి చేరుకొని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ఉపసర్పంచ్‌గా ఉన్న జంగిలి అనిత వద్ద మాజీ ఉపసర్పంచ్ అని ఫ్లెక్సీలో స్టిక్కర్లు అంటించారు. దాంతో ప్రస్తుతానికి వివాదం సద్దుమణిగింది.

జర్నలిస్టులకు త్వరలో కొత్త అక్రిడిటేషన్లు

- సర్కారు మార్గదర్శకాలు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని జర్నలిస్టులకు ఇచ్చే మీడియా అక్రెడిటేషన్ కార్డుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2016 నాటి పాత నిబంధనలను రద్దు చేస్తూ, 'తెలంగాణ మీడియా అక్రెడిటేషన్ రూల్స్–2025'ను ఖరారు చేస్తూ ప్రభుత్వం జీవో నెంబరు 252ను జారీ చేసింది. ఈమేరకు కొత్త నిబంధనలను రూపొందించింది. రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి అక్రెడిటేషన్ కమిటీల పదవీ కాలం రెండేండ్లుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పుడు ఏర్పాటయ్యే కమిటీలే మళ్లీ కొత్తవి వచ్చే వరకు కొనసాగుతాయి. తాజా జీవోలో అక్రిడిటేషన్లను రెండుగా వర్గీకరించారు. ఫీల్డ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు కార్డులు ఇస్తారు. డెస్క్ జర్నలిస్టులకు మీడియా కార్డులు అందజేశారు. ప్రభుత్వ సమాచారాన్ని సేకరించేందుకు రిపోర్టర్లకు ఇచ్చేది అక్రిడిడేషన్ కార్డు అని కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు. డెస్క్ జర్నలిస్టులకు ఇచ్చే మీడియా కార్డులు కేవలం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం పొందేందుకు ఉపయోగించుకోవచ్చని జీవోలో తెలియజేశారు. అక్రిడిటేషన్లు జారీచేసేందుకు మీడియా అకాడమీ చైర్మన్ రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీకి చైర్మెన్‌గా, సమాచారా శాఖ కమిషనర్ లేదా స్పెషల్ కమిషనర్ కో–చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో వివిధ జర్నలిస్ట్ యూనియన్లకు చెందిన ప్రతినిధులు, పిసిఐ సభ్యులు ప్రతినిధులుగా ఉంటారని మార్గదర్శకాలు వివరించారు. జిల్లా అక్రిడిటేషన్ కమిటీకి జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, డిపిఆర్ఒ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అక్రెడిటేషన్ కార్డులను దుర్వినియోగం చేసినా, తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా కార్డులను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని నిబంధనల్లో పోగొట్టుకున్న కార్డుల స్థానంలో డూప్లికేట్ కార్డు కోసం రూ.250 చెల్లించాల్సి ఉంటుందని జిఒలో తెలిపారు.

మేం 'హోప్' హైప్' చేసుకోవట్లే!

- రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిపై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం నమ్మకం (హోప్) కలిగించేలా నిర్ణయాలు తీసుకుంటున్నదని పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. బిఆర్ఎస్ హయాంలో పెట్టుబడులపై అతిశయోక్తులతో వాస్తవాలకు మించి ప్రచారం (హైప్) చేసుకున్నారని విమర్శించారు. రెండు ప్రభుత్వాలకు మధ్య తేడా ఇదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులపై మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖరరావు చేసిన విమర్శలపై ఆయన స్పందించారు. సోమవారంనాడిక్కడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావొద్దనీ, పెట్టుబడులు, ఉద్యోగాలు రావొద్దనేదే బీఆర్ఎస్ విధానమని విమర్శించారు. అందుకే మాజీ సీఎం కేసీఆర్ పారిశ్రామికవేత్తలను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఆయన హయాంలో తక్కువ పనిచేసి, ప్రచారం ఎక్కువ చేసుకున్నారనీ, తాము దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నామని వివరించారు. ఆయన హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటే 'కుటుంబం' అనుమతి తప్పనిసరి అనీ, ఆ 'గేట్ పాస్' కల్చర్‌కు తాము ఫుల్‌స్టాప్ పెట్టామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌లో వచ్చిన రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడులు, ఎంఓయూలు అబద్ధమని చెప్పి, ఆయన దిగ్గజ వ్యాపార సంస్థల్ని కించపరిచారన్నారు. ఐటీ, ఏరోస్పేస్, డిఫెన్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో పేటెంట్ హక్కులు కాంగ్రెస్ ప్రభుత్వాలకే ఉన్నాయన్నారు. తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపామన్నారు. కేసీఆర్ విమర్శలు చేసేముందు ఓసారి గతాన్ని చూసుకోవాలని ఎద్దేవా చేశారు. ప్రజాప్రభుత్వంపై ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా, ప్రపంచపటంలో రాష్ట్రాన్ని నెంబర్‌వన్‌గా నిలుపుతామన్నారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్కు మీద పేటెంట్ ఎవరిదని ప్రశ్నించారు. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులపై బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని హితవు పలికారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

- మంత్రి పొంగులేటికి రెవెన్యూ ఉద్యోగ జెఎసి చైర్మన్ లచ్చిరెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ (టిజిటిఎ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టిజిఆర్ఎస్ఎ) నేతలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సిసిఎల్ఎ కార్యాలయానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వచ్చి రెవెన్యూ ఉన్నతాధికారులతో శాఖాపరమైన సమీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎల్ఎ లోకేశ్‌కుమార్ సమక్షంలో రెవెన్యూ ఉద్యోగుల జెఎసి చైర్మన్ వి లచ్చిరెడ్డి నేతృత్వంలో మంత్రి పొంగులేటిని మర్యాదపూర్వకంగా కలిశారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రతి సమస్యనూ పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిజిటిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రాములు, టిజిటిఎ ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, సెక్రెటరీ జనరల్ పూల్‌సింగ్ చౌహాన్, టిజిఆర్ఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి భిక్షం, కోశాధికారి మల్లేష్ పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE STATE CONSUMER DISPUTES REDRESSAL COMMISSION OF TELANGANA AT :: HYDERABAD.
F.A. NO.372 OF 2025
&
F.A.I.A.No.1266 OF 2025

Miss. Rachamalla Sahithi ...Petitioner/Appellant
AND
M/s. Jana Chaithanya Housing (P) Ltd., & two others ...Respondents/Opp. Parties

To,
Jana Chaithanya Housing (P) Ltd., Rep. by its Manager, R/o. H.No.7-2-1/A, Mankammathotha, Karimnagar-500001.
(The Respondent No.3/Opposite Party No.3 in the Appeal)

NOTICE

Please take notice that, I.A.No.1266/2025 (condonation of delay of 539 days) and as well as F.A. NO.372 OF 2025 stands posted to 19.01.2026 for your Respondent/opp. party No.3 appearance. Therefore, you the Respondent/Opposite Party No.3 is hereby informed to appear before the Hon'ble State Consumer Disputes Redressal Commission of Telangana, Eruvaka Buildings, OPP. to Sridhar Function Hall, Zilla Parishad Road, Anandnagar colony, Khairatabad, Hyderabad - 500004 on **19.01.2026** at **10.30** a.m., failing which, the Hon'ble State Commission may proceed with the case in your absence.

//By the orders of the Hon'ble State Commission of Telangana:: Hyderabad//

K.VISWESWARA RAO
ADVOCATE
H.No: 2-3-103/1, Adarsh Nagar Colony. Nagole, Hyderabad.
9440455188

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని ప్రభుత్వం అమలు చేయాలి

- ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్
- ఆమనగల్ నుంచి చలో సెక్రటేరియట్ పాదయాత్ర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండే కార్ యాదిలాల్ డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణంలోని జూనియర్ కోర్టు ఆవరణలో చలో సెక్రటేరియట్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు హనుమంత్ రెడ్డి, ఫణీంద్ర భార్గవ్, రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కార్యదర్శి కార్తీక్ పాదయాత్రను ప్రారంభించి మాట్లాడారు. న్యాయవాదుల రక్షణకు ప్రభుత్వం వెంటనే చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో భాగంగా చాలామంది న్యాయవాదులు దాడులకు గురవుతున్నారని తెలిపారు. అంతేకాక కొన్ని ప్రాంతాల్లో దుండగుల చేతుల్లో ప్రాణాలు కూడా కోల్పోతున్నట్టు చెప్పారు. న్యాయవాదులతోపాటు వారి కుటుంబాల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ అధ్యక్షులు వేణుగోపాలరావు, మహేశ్వరం అధ్యక్షులు హరికిషన్‌గౌడ్, కార్యదర్శి సుభాష్ రెడ్డి, ఖుషి ఫౌండేషన్ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది మడుపు శశికాంత్, ఆమనగల్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులుయాదవ్, ఉపాధ్యక్షులు ఏర్పుల రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి విజయ్ కుమార్, కోశాధికారి కొప్పు కృష్ణ, వివిధ ప్రాంతాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.ఆమనగల్ పట్టణం నుంచి హైదరాబాద్ వరకు చలో సెక్రటేరియట్ న్యాయవాదులు నిర్వహిస్తున్న పాదయాత్రను స్థానిక ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని అయ్యసాగర్ క్షేత్రం వద్ద పోలీసులు అడ్డుకొని అరెస్టు చేసి, అనంతరం విడుదల చేశారు.

నాగరికత వికాసంలో పుస్తకం గొప్ప మార్పు ప్రక్రియ

- ప్రొఫెసర్ పార్థసారథి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవ నాగరికత వికాసంలో పుస్తకం ఒక గొప్ప మార్పు ప్రక్రియ అనీ, సామాజిక చైతన్యానికి అది ప్రధాన మెట్టు అని ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ పార్థసారథి తెలిపారు. 38 హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో భాగంగా అనిశెట్టి రజిత వేదికపై సోమవారం సాయంత్రం 'పుస్తకం దారి దీపం' అనే అంశం చర్చా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ పార్థసారథి సమన్వయకర్తగా వ్యవహరించారు. అరుణోదయ విమల, సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ ఒక పుస్తకం మన పాత భావాలను మార్చి కొత్త ఆలోచనలను రేకెత్తించినప్పుడే దానికి సార్థకత చేకూరుతుందని చెప్పారు. 50 ఏండ్ల క్రితం తాను చదివిన రాజారామోహన్ రావు కథ నేటికీ తనను వెంటాడుతోందని చెప్పారు. సమాజంలోని అత్యంత క్రూరమైన వాస్తవాల నుంచే గొప్ప కథలు పుడతాయని వివరించారు. వట్టికోట ఆళ్వారుస్వామి రచించిన 'ప్రజల మనిషి', బంకిమ్ చంద్ర ఛటర్జీ 'దుర్గేష్ నందిని' వంటి నవలకు ఉన్న ప్రభావం సామాన్యమైంది కాదని గుర్తుచేశారు. పుస్తకాలు కేవలం అక్షరాల కూర్పు కాదనీ, అవి మన అంతరాల్లోని చీకటిని తొలగించే జ్ఞాన దీపాలని ఆయన కొనియాడారు.అరుణోదయ విమల మాట్లాడుతూ మనిషి జీవితంలో పుస్తకం ఒక గొప్ప మార్పునకు భూమిక పోషిస్తుందని ప్రముఖ ప్రజా గాయని తెలిపారు.తన ఇంటర్మీడియట్ రోజుల్లో బహుమతిగా వచ్చిన మాక్సిమ్ గోర్కీ 'అమ్మ', అలెగ్జాండర్ హేలీ 'ఏడు తరాలు' నవలలు తన జీవితాన్ని మలుపు తిప్పాయని గుర్తు చేసుకున్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 ఏండ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకొనీ, ఉద్యమాల్లో ఆ సంస్థ ఎదుర్కొన్న ఒడిదొడుకులు, కళాకారుల అనుభవాలను క్రోడీకరిస్తూ సుమారు 670 పేజీలతో ప్రత్యేక 'సావనీర్'ను రూపొందించినట్టు తెలిపారు. ఈ బుక్ ఫెయిర్‌లో అందుబాటులోకి తెస్తున్నట్టు వెల్లడించారు.తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడుతూ మారుమూల పల్లెలో నిరక్షరాస్య తల్లిదండ్రుల మధ్య పుట్టిన తాను నేడు సాహిత్య అకాడమీ కార్యదర్శి స్థాయికి చేరడానికి పుస్తకాలే దారిదీపాలుగా నిలిచాయని తెలిపారు. తెలుగు మీడియం పాఠశాల నుంచి పీహెచ్‌డీ వరకు తన ప్రయాణం పుస్తకాల వల్లే సాధ్యమైందని చెప్పారు. గాంధీజీ రచించిన 'సత్యశోధన' తనలో నిజాయితీని నింపగా, వివేకానందుని సూక్తులు యువతలో ధైర్యాన్ని, ఏదో సాధించాలనే తపనను కలిగిస్తాయని వివరించారు. శ్రీశ్రీ 'మహా ప్రస్థానం' వంటి రచనలు మనిషి శక్తిని సన్మార్గంలో నడిపిస్తాయని కొనియాడారు. సాంకేతికత అందుబాటులో ఉన్న నేటి కాలంలోనూ పుస్తకం మనిషిని ప్రభావితం చేస్తూనే ఉంటుందనీ, చిన్నతనంలో చదివే పుస్తకాలే జీవితానికి దిక్సూచులని ఆయన స్పష్టం చేశారు.

నీటి తొట్టిలో పడి బాలుడు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చిన్నారి నీటి తొట్టిలో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటన సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివంపేట గ్రామానికి చెందిన 17 నెలల బాలుడు ఫైజల్ ఇంటి సమీపంలో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడ్డాడు. బాలుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించారు. సుమారు రెండు గంటల తర్వాత దగ్గర్లో ఉన్న నీటి తట్టిలో పడి ఉండటం గమనించారు. వెంటనే కుటుంబ సభ్యులు బాలుడిని బయటకి తీసి, ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు.

ఆరోగ్యం, విద్య తమ ప్రభుత్వం ఎజెండా : డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ : ఆరోగ్యం, విద్య, ఉపాధి వంటి సామాన్య జనుల సమస్యల పరిష్కారం లక్ష్యంగా తమ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందనీ, అదే తమ ఎజెండా అని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. డయాగ్నోస్టిక్ చైన్‌లలో ఒకటైన న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ తన 'విజయ మెడికల్ సెంటర్-ఎ యూనిట్ ఆఫ్ న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్' బ్రాండ్ కింద తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించింది. విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న విజయ మెడికల్ సెంటర్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా న్యూబెర్గ్ తెలంగాణ వ్యాప్తంగా తమ కార్యకలాపాలను మరింత విస్తృతం చేసుకుంటోంది. ఈ కార్యక్రమాలలో భాగంగా పది క్లినికల్ ల్యాబ్‌లు, 25కు పైగా కస్టమర్ కేర్ సెంటర్లను భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో విజయ మెడికల్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ కొప్పాక సూర్యనారాయణ, మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పిటల్ వ్యవస్థాపకులు, సహ-చైర్మన్ డాక్టర్ కాసు ప్రసాద్ రెడ్డి, న్యూబెర్గ్ డయాగ్నోస్టిక్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జిఎస్‌కె వేలు పాల్గొన్నారు.విజయ మెడికల్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రెండవ శ్రేణి నగరాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో డయాగ్నస్టిక్స్ సెంటర్స్ ప్రారంభించాలని విజయ మెడికల్ సెంటర్ అభినందనీయమన్నారు. వారు గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, అన్ని రకాల పరీక్షలను చేయాలని, అందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందిస్తామని అన్నారు. ఆరోగ్యం లేకుండా గౌరవం ఉండదని, గౌరవం లేకుండా నిజమైన అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రజా ఆరోగ్యాన్ని మౌలిక అంశంగా తీసుకుని ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్ వెలుపల ప్రాంతాల్లో నాణ్యమైన డయాగ్నోస్టిక్ సదుపాయాల విస్తరణ కీలకమన్నారు.

రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలు ఒకే గొడుగు కిందకు

- భూభారతి పోర్టల్‌తో అనుసంధానం
- రైతులకు పూర్తి భూ సమాచారం
- ప్రతి సర్వే నెంబర్‌కూ మ్యాప్ రూపకల్పన : మంత్రి పొంగులేటి

సిఎల్ఎ కార్యాలయాన్ని సందర్శిస్తున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ పరిపాలన వ్యవస్థను మరింత పారదర్శకంగా వేగవంతంగా అందించడానికి రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తేవాలని నిర్ణయించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. భూభారతి పోర్టల్‌తో అనుసంధానం చేస్తామని వివరించారు. వచ్చే నెలలో ఆధునీకరించిన ఈ వ్యవస్థను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ నాంపల్లిలోని సిసిఎల్ఎ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. భూ పరిపాలనకు కేంద్రమైన సిసిఎల్ఎ కార్యాలయం నిర్వహణ సరిగ్గా లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ఈ కార్యాలయాన్ని ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నెలలో మరోసారి కార్యాలయాన్ని తనిఖీ చేస్తాననీ, అప్పటివరకు కొంతమార్పు కనిపించాలని కోరారు. వరుసగా విభాగాల వారీగా సమీక్షించడం కూడా జరుగుతుందనీ, ఇందుకు సంబంధించి అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వం వివిధ అవసరాల కోసం ప్రయివేటు వ్యక్తుల నుంచి భూ సేకరణ జరిపిందని వివరించారు. ఇప్పటికీ కొన్ని భూములు ప్రయివేటు వ్యక్తుల పేరు మీదే ఉన్నాయనీ, ఇవన్నీ కూడా రికార్డుల్లో మార్చాలని సూచించారు. అసైన్డ్, భూధాన్ భూములపై సమీక్షతోపాటు కొన్నేళ్ల నుంచి ఉద్యోగులపై విజిలెన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనీ, ఏ విభాగంలో ఎన్ని కేసులు పెండింగ్‌లో ఉన్నాయి, ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, కోర్టు కేసులన్నింటిపై పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తానని అన్నారు.

ఒకే మోడల్‌లో తహశీల్దార్ కార్యాలయాలు

రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా నిర్మించబోయే తహశీల్దార్ కార్యాలయాలు ఒకే మోడల్‌గా ఉండాలనీ, ఇందుకు సంబంధించిన డిజైన్ రూపొందించాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఒక్క క్లిక్‌తో రైతుకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్, నాలా ఆర్డర్లు, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, ఫీడ్ బ్యాక్ వంటి పూర్తి సమాచారం లభించేలా సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలతో అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని వివరించారు. ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావాల్సిన సమాచారం లభిస్తుందన్నారు. క్రయ, విక్రయదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి సర్వే నెంబర్‌కు మ్యాప్‌ను రూపొందించే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని వెల్లడించారు. రెవెన్యూ వ్యవస్థ ఆధునీకరణ చేసే ప్రతిపనిలో సామాన్యుని కోణం ఉండాలనీ, ఎలాంటి లోపాలకు, తారుమారుకు ఆస్కారం లేకుండా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి పర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, సిసిఎల్ఎ ఇన్‌ఛార్జి కార్యదర్శి మంధా మకరంద్, ఎన్ఐసీ ఎస్ఐఓ ప్రసాద్, విజయ్‌మోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాంతా సిన్హా

పుస్తక పఠనం ఊహాశక్తిని పెంచుతుంది

- బాలచెలిమి సంపాదకులు ఎం.వేద కుమార్
- చిన్న పుస్తకాల వెనుక వేలాది మంది కృషి : శాంతా సిన్హా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సెల్‌ఫోన్ ద్వారా ఊహపోతుందని.. పుస్తక పఠనం మరింత ఊహాశక్తిని పెంచుతుందని బాలచెలిమి సంపాదకులు మణికొండ వేద కుమార్ అన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లోని కొంపెల్లి వెంకట్‌గౌడ్ వేదికలో సోమవారం చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమి, బాలచెలిమి మాసపత్రిక సంయుక్త నిర్వహణలో ఎనిమిది బాలసాహిత్య కథల పుస్తకాల ఆవిష్కరణ జరిగింది. బాలచెలిమి సంపాదకులు వేదకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పిల్లల నైపుణ్యాలను వెలికి తీసి వాటిని బాలచెలిమి పత్రికలో ప్రచురిస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 41 బాలచెలిమి గ్రంథాలయాలు పెట్టామని, త్వరలో 100 గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. జాతీయ స్థాయిలో పెద్దలకు, పిల్లలకు, యువకులకు కథల పోటీలు నిర్వహించి వాటిలో ఎంపికైన ఉత్తమ కథలకు బహుమతులు అందజేశామని తెలిపారు. జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మాజీ చైర్‌పర్సన్ శాంతాసిన్హా మాట్లాడుతూ.. ఈ చిన్న పుస్తకాలు రావడం వెనక వేలాది మంది కృషి ఉందన్నారు. సోషల్ మీడియాకు పోటీగా బాల సాహిత్యాన్ని పెడుతున్నామన్నారు. ఈ సందర్భంగా వేదకుమార్ కృషిని ప్రశంసించారు. ఒయు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘు పుస్తకాలను విశ్లేషిస్తూ.. నిమిది పుస్తకాలు మూడు తరాలకు సారథ్యం వహిస్తాయన్నారు.

తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. 30 ఏళ్ల కిందటి కంటే ఈనాడు బాల సాహిత్యం విరివిగా నాణ్యంగా వస్తోందన్నారు. కథ వస్తువులో మార్పు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి వేదికను పంచుకున్నారు. చివరగా ప్రముఖులకు శాలువాలతో సత్కారం, బాలచెలిమి పుస్తకాల కిట్లను అందజేశారు. బాలచెలిమి కన్వీనర్ గరిపెల్లి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎస్ రాములు, చొక్కాపు వెంకటరమణ, ఆర్.వెంకటరెడ్డి, రామ్ రాజ్, అమరవాది నీరజ, పైడిమర్రి గిరిజ, విఆర్ శర్మ, బాలసాహితీవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

నరెడ్కో తెలంగాణ 30వ వార్షికోత్సవ వేడుకలు

హైదరాబాద్ : నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నారెడ్కో) తెలంగాణ సభ్యులు తమ 30 ఏళ్ల వార్షికోత్సవాలను వేడుకను నిర్వహించుకుంటున్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నారెడ్కో తెలంగాణ అధ్యక్షులు విజయ సాయి మేకా మాట్లాడుతూ.. తాము పరిశ్రమలోకి ప్రవేశించి మూడు దశాబ్దాలు అయ్యిందన్నారు. తమ సభ్యులు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ వృద్ధికి భారీ మద్దతును అందించారన్నారు. ప్రయివేటు, ప్రభుత్వ రంగాల మధ్య సహకారాన్ని ప్రోత్సహించగలిగామన్నారు. నారెడ్కో తెలంగాణ ప్రధాన కార్యదర్శి కె శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ.. తాము హైదరాబాద్ రియాల్టీ అభివృద్ధికి సేవ చేస్తూనే ఉంటామన్నారు.

హైదరాబాద్‌లో నెక్స్ట్ రెండవ స్టోర్ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రీమియం ఫ్యాషన్ బ్రాండ్ నెక్స్ట్ దేశంలోనే తన రెండవ ఎక్స్‌క్లూజివ్ బ్రాండ్ స్టోర్‌ను హైదరాబాద్‌లోని లేక్‌షోర్ మాల్‌లో ప్రారంభించినట్లు ప్రకటించింది. పుణెలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన కొద్ది సమయంలో ఇక్కడ మరో స్టోర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. మింత్రా జబాంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దాని లైసెన్స్ పొందిన ఫ్రాంచైజీ భాగస్వాములతో కలిసి నెక్స్ట్ భారత్‌లో విస్తరణ కార్యక్రమాలు చేపట్టిందని పేర్కొంది. ఈ సంస్థకు బ్రిటన్‌లో 460కి పైగా స్టోర్లున్నాయి. 80 దేశాలలో ఉనికిని కలిగి ఉంది.

లెక్సస్ ఎల్ఎం 350హెచ్ అమ్మకాల్లో 40 శాతం వృద్ధి

హైదరాబాద్ : లగ్జరీ కార్ల తయారీ కంపెనీ లెక్సస్ ఇండియా తన ఎల్ఎం 350హెచ్ అమ్మకాల్లో మెరుగైన వృద్ధిని కనబర్చినట్లు తెలిపింది. ఈ ఏడాది నవంబర్ 40 శాతం పెరుగుదలను సాధించినట్లు పేర్కొంది. గతేడాదితో పోల్చితే 2025 జనవరి నుంచి నవంబర్ కాలంలో 15 శాతం వృద్ధి చోటు చేసుకుందని లెక్సస్ ఇండియా ప్రెసిడెంట్ హికారు ఇకేయుచి పేర్కొన్నారు.

పిఆర్‌టియు తెలంగాణ అధ్యక్షులుగా ఎండి అబ్దుల్లా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిఆర్‌టియు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా ఎండి అబ్దుల్లా, ప్రధాన కార్యదర్శిగా పులి దేవేందర్ ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పిఆర్‌టియు తెలంగాణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పి వెంకట్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఆర్ వెంకటేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై తీర్మానాలు చేశామని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌లో ఉపాధ్యాయులు అర్హత సాధించాలనే నిబంధనను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే విడుదల చేయాలనీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలని సూచించారు. 317 జిఒ బాధితుల సమస్యను పరిష్కరించాలని తెలిపారు. 190 జీవో ప్రకారం స్థానిక జిల్లాలకు రెండేళ్ల డిప్యూటేషన్ ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలని కోరారు.

గాదె ఇన్నయ్య అరెస్టు అప్రజాస్వామికం : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సామాజిక కార్యకర్త, అనాథాశ్రమాన్ని నిర్వహిస్తున్న గాదె ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అప్రజాస్వామికంగా అరెస్టు చేయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఒక ప్రకటన విడుదల చేశారు. 'మావోయిస్టు నేత కాతా రామచంద్రారెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని అక్కడ జరిగిన సభలో మావోయిస్టులకు అనుకూలంగా మాట్లాడారనే నెపంతో ఈ అరెస్టు జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆపరేషన్ కగార్, కేంద్ర ప్రభుత్వ నిరంకుశ ధోరణులను వ్యతిరేకిస్తున్నవారిని, సామాజిక సమస్యలపై స్పందించే వ్యక్తులను అరెస్టులు చేయడం ప్రజాస్వామిక గొంతుకలను అణచివేయడమే. ఇన్నయ్య అరెస్టును భావవ్యక్తీకరణ స్వేచ్ఛపై జరిగిన దాడిగా భావిస్తున్నాం. ప్రజాస్వామిక వాదులందరూ ఈ అరెస్టును వ్యతిరేకించాలి' అని పేర్కొన్నారు.

45 టిఎంసిలకు లేఖ రాయడం చారిత్రక తప్పిదం

- తెలంగాణ ప్రజలకు మంత్రి ఉత్తమ్ క్షమాపణ చెప్పాలి
- పాలమూరు బిడ్డ అంటూ మోసగిస్తున్న రేవంత్‌రెడ్డి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి 45 టిఎంసిలు చాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాయడం చారిత్రక తప్పిదని మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ ప్రజలకు ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ లేఖను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి 90 టిఎంసిలకు బిఆర్ఎస్ హయాంలో కేంద్ర ప్రభుత్వం అటవీ, పర్యావరణ వంటి ఏడు అనుమతులను ఇచ్చిందని గుర్తు చేశారు. 90 టిఎంసిలకు సంబంధించి 2022లో జీవో నెంబర్ 246ను జారీ చేశామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిపిఆర్‌ను వెనక్కి తెచ్చిందన్నారు. ఏడు నెలలవుతున్నా ప్రభుత్వం కేంద్రంపై ఎందుకు ఒత్తిడి తేవడం లేదని ప్రశ్నించారు. ఎపిలో చంద్రబాబు, ఢిల్లీలో మోడీకి సిఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని అన్నారు. 90 టిఎంసిలను 45 టిఎంసిలకు తగ్గించి తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.27 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. 2014 నుంచి 2023 వరకు 17.24 లక్షల ఎకరాల భూమికి సాగునీరు అందించామని అన్నారు. మిషన్ భగీరథ, చెక్‌డ్యామ్‌ల ద్వారా 31 లక్షల ఎకరాల భూమిని స్థిరీకరించామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం 48 ఎకరాల భూమికి నీళ్లిచ్చామని అన్నారు. 2024-25లో 6,55,895 ఎకరాలకు, 2025-26లో 5,05,000 ఎకరాలు కలిపి మొత్తం 11 వేల ఎకరాలకు నీళ్లిస్తామన్నారని, ఎక్కడ ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా తప్పు చెప్పానంటూ క్షమాపణ చెప్పాలని కోరారు. ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లను కూల్చివేస్తున్న అసలైన ఉగ్రవాది రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. ఎస్ఎల్‌బిసి కుప్పకూలితే శవాలను బయటకు తీయలేని చాతగాని ప్రభుత్వమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నీటి ప్రయోజనాలు పట్టడం లేదన్నారు. ఈ ద్రోహాన్ని వదిలిపెట్టబోమని చెప్పారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో ఊరూరా డప్పు కొట్టి ప్రజల్లోకి వెళ్తామన్నారు. ఆయా జిల్లాల్లో సభలు నిర్వహిస్తామని అన్నారు. 90 టీఎంసీల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ స్టేట్స్‌మెన్... రేవంత్ స్ట్రీట్ రౌడీ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్టేట్స్‌మెన్ అనీ, సీఎం రేవంత్‌రెడ్డి స్ట్రీట్ రౌడీలా మాట్లాడుతున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్ మరుగుజ్జు మనస్తత్వం ఉన్న వ్యక్తి అని చెప్పారు. కేసీఆర్ వ్యక్తిత్వం హిమాలయాల ఎత్తుంటే, రేవంత్ చిల్లర రాజకీయాలు చేస్తూ సంకుచిత మనస్తత్వంతో ఉన్నారని అన్నారు. త్యాగాల చరిత్ర తమదనీ, వెన్నుపోటు చరిత్ర వారిదని చెప్పారు. సోనియాను దేవత అనీ, బలిదేవత అన్నారని గుర్తు చేశారు. ఆసరా పెన్షన్ రూ.నాలుగు వేలు, మహిళలకు రూ.2,500 ఎప్పుడిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఫార్మాసిటీని ఎందుకు రద్దు చేశారని అడిగారు. రేవంత్‌రెడ్డికి నీతి, జాతి, విలువలున్నాయా?అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాలొన్నారు.

ఫ్రీ ఎన్‌బిడబ్ల్యుగా రాచకొండ

- గతేడాదితో పోలిస్తే పెరిగిన నేరాల సంఖ్య
- 78 శాతం కేసుల పరిష్కారం
- రాచకొండ సిపి సుధీర్‌బాబు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఫ్రీ ఎన్‌బిడబ్ల్యుగా ఉండడం గర్వంగా ఉందని సిపి సుధీర్‌బాబు తెలిపారు. రాచకొండలో ఈ ఏడాది నేరాల సంఖ్య పెరిగిందన్నారు. దేశంలోనే అతిపెద్ద కమిషనరేట్ అయిన రాచకొండ 2025 క్రైమ్ వార్షిక నివేదికను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో మొత్తం 51 పోలీస్ స్టేషన్‌లు ఉన్నాయని తెలిపారు. 2024లో 28,626 కేసులు నమోదు కాగా.. 2025లో 33,040 కేసులు నమోదయ్యాయని వివరించారు. ఈ ఏడాదిలో 78 శాతం కేసులు పరిష్కారం అయ్యాయని చెప్పారు. నేరాల సంఖ్య పెరిగినప్పటికీ 21,056 కేసులను పరిష్కరించడం గర్వకారణమన్నారు. ముఖ్యంగా కిడ్నాప్, పోక్సో కేసులు పెరిగినట్టు సిపి తెలిపారు. ఈ ఏడాది 579 కిడ్నాప్ కేసులు, 1,224 పోక్సో కేసులు నమోదయ్యాయన్నారు.

మహిళలపై నేరాలు గత ఏడాదితో పోలిస్తే నాలుగు శాతం పెరిగినట్టు చెప్పారు. వరకట్న హత్యలు ఆరు కేసులు, వరకట్న మరణాలు 12 కేసులు, ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులు 52, వేధింపులు-గృహహింస కేసులు 782, మహిళల హత్యలు 18, లైంగికదాడుల్లో 330 కేసులు నమోదైనట్టు వివరించారు. 12 కీలక కేసుల్లో దోషులకు 20 ఏండ్ల జైలు శిక్ష పడేలా పటిష్ట దర్యాప్తు నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో ఈ ఏడాది జీవిత ఖైదు శిక్ష పడిన 31 కేసులు రాచకొండ కమిషనరేట్ పరిధిలోనే నమోదవ్వడం విశేషమన్నారు. ఇందులో అడ్డగూడూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక హత్య కేసులో 17 మందికి శిక్ష పడినట్టు చెప్పారు. డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపామని, ఈ ఏడాది రూ.20.01 కోట్ల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని 495 మందిని అరెస్టు చేసినట్టు సిపి తెలిపారు. ఇందులో తెలంగాణకు చెందిన 322 మంది, ఇతర రాష్ట్రాలకు చెందిన 172 మంది, ఒక విదేశీయుడు ఉన్నట్టు వెల్లడించారు. అలాగే 227 ఎన్‌డిపిఎస్ అనుమానిత షీట్లను తెరిచామని చెప్పారు.

సైబర్ నేరాల విషయంలో 3,734 కేసులు నమోదు కాగా, రూ.40.10 కోట్ల నగదును రికవరీ చేసినట్టు తెలిపారు. మొత్తం 6,188 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామన్నారు. ఈ ఏడాది ఎక్సైజ్ యాక్ట్ కింద 656 కేసులు నమోదు చేయగా.. 689 మందిని అరెస్టు చేసినట్టు సిపి తెలిపారు. కాగా 6,824 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు చెప్పారు. గేమింగ్ యాక్ట్ కింద 227 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కేసుల్లో 1,472 మంది అరెస్టు కాగా.. రూ.69 లక్షల ప్రాపర్టీ సీజ్ చేసినట్టు చెప్పారు. అలాగే.. మర్డర్ ఫర్ గెయిన్ 3, దోపిడీ 3, దొంగతనాలు 67, ఇండ్లలో చోరీ 589, వాహనాల చోరీ 876, సాధారణ చోరీలు 1,161, హత్యలు 73, లైంగికదాడులు 330, వరకట్నం మరణాలు 12, గృహ హింస కింద 782 కేసులు నమోదయినట్టు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బీనగర్, మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి డిసిపిలు, ట్రాఫిక్ డిసిపిలు, ఎస్‌ఓటి అడిషనల్ డిసిపి, అడిషనల్ డిసిపిలు పాల్గొన్నారు.

బిటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బిటిఎఫ్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. బిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా కల్వదర్శి చైతన్య, ప్రధాన కార్యదర్శిగా మేఘావత్ సంతోష్ నాయక్, గౌరవాధ్యక్షులుగా మార్వాడి గంగరాజు, కోశాధికారిగా కాడం బాలశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పట్నం చెన్నయ్య, అదనపు ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సిద్దార్థ, బియ్య సాగర్, ఉపాధ్యక్షులుగా చంద్రకళ, సువార్తమ్మ, ఖలీల్‌పాషా, ఎల్ శంకర్, కెడెం శ్రీనివాసులు, డి బాలస్వామి, జె శ్రీశైలం, బిక్షపతి నాయక్, జాయింట్ సెక్రెటరీ ఎం విజయ్‌కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బిటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్డెమాన్ బాలపీర్ వ్యవహరించారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్‌ను అందించాలని కోరారు.

చెక్‌డ్యాములు కూలిన ఘటనపై విచారణ

- నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దపల్లి జిల్లా గుంపుల, అడవి సోమనపల్లి గ్రామాల్లో చెక్ డ్యాములు కూలిపోయిన ఘటనపై విజిలెన్స్ విచారణకు ఆదేశించినట్టు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాసిరకంగా నిర్మించినా లేదా ఎవరైనా కావాలనే ధ్వంసం చేసినట్టు తేలినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కూలిన ఘటనలను ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని పేర్కొన్నారు. విచారణను వేగవంతం చేసి బాధ్యులను గుర్తించాలని ఆదేశించినటు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎవరైనా కావాలని రైతులకు మేలు చేసే చెక్ డ్యాంలను ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తే ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికే దక్కేలా కార్యాచరణ

- కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మణుగూరు డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు దక్కేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలని సింగరేణి కార్మిక సంఘాలు నిర్ణయించాయి. సోమవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. డిప్‌సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించడం ద్వారా ప్రాంతీయ ఉపాధి, సంస్థ భవిష్యత్ స్థిరత్వం, కార్మికుల భద్రతకు భరోసా లభిస్తుందని సమావేశం అభిప్రాయపడింది. ఈ క్రమంలో డిప్‌బ్లాక్‌ను సంస్థకు దక్కేలా అన్ని చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘాలు ప్రతిపాదించాయి. కోయగూడెం 3, సత్తుపల్లి 3 బ్లాకులు కూడా సింగరేణి సంస్థకే దక్కేలా చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు.

అనంతరం సింగరేణి డైరెక్టర్ కొప్పుల వెంకటేశ్వర్లును కలసి సమావేశంలో చర్చించిన అంశాలను వివరించారు. ఈ సమావేశంలో ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రటరీ రాజ్ కుమార్, ఐఎన్‌టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, టిబిజికెఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి, సిఐటియు జనరల్ సెక్రటరీ మంద నరసింహ రావ్, టిఎన్‌టియుసి అధ్యక్షులు పెద్దపల్లి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ రాజయ్య పాల్గొన్నారు.

నీళ్లపై నిగ్గు తేలాలంటే మామా అల్లుళ్లు అసెంబ్లీలో మాట్లాడాలి : ఎమ్మెల్సీ వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నీళ్లపై నిగ్గు తేలాలంటే మామ కేసీఆర్, అల్లుడు హరీశ్‌రావు అసెంబ్లీలో మాట్లాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సవాల్ విసిరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. హరీశ్ రావుకు దమ్ముంటే కెసిఆర్‌ను అసెంబ్లీకి తీసుకురావాలని సూచించారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనపై చర్చిద్దామని తెలిపారు. ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచి, పక్క రాష్ట్రం కోసం తెలంగాణకు బిఆర్ఎస్ అన్యాయం చేసిందని వెంకట్ విమర్శించారు.

బొలెరోను ఢీకొట్టిన లారీ

- ముగ్గురు మహిళా కార్మికుల దుర్మరణం
- 13 మందికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళా వలస కార్మికులు దుర్మరణం చెందారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా చాందిలీబుజ్ గ్రామానికి చెందిన కార్మికులు బొలెరో వాహనంలో పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు పనులు కోసం వెళ్తున్నారు. వాహనంలో 23 మంది కార్మికులు ఉన్నారు. సోమవారం తెల్లవారు జామున ఇందారం ఎక్స్ రోడ్డు వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన లారీ బొలెరోను ఢీకొట్టింది. ఈ ఘటనలో బొలెరోలో ఉన్న మీనా అనిల్ లాటీల్‌వాల్ (45) అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. లీలాబాయి మండ్రె (65), విమల్‌బాయి సోయం (48) మంచిర్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలోనూ అత్యధికులు మహిళలే ఉన్నారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. లారీ డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు చెప్పారు. సిఐ నవీన్‌కుమార్ విచారణ చేపట్టగా, సంఘటనా స్థలాన్ని జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లుతో కలిసి మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్ పరిశీలించారు. సింగరేణి జిఎం ఆఫీస్ దాటిన తర్వాత చెన్నూర్ వైపు గల రహదారి మధ్యలో డివైడర్ ఉండటంతో రోడ్డు ఇరుకుగా ఉంది. వెనుక వైపు నుంచి వచ్చే వాహనాలు ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయడానికి ఇబ్బంది ఉంటుంది.

కలినరీ అకాడమీలో పరంపరగాట పాక కళ వంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్

బేగంపేటలోని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా మరో ప్రపంచ రికార్డుపై దృష్టి పెట్టింది. క్రిస్మస్ సందర్భంగా పరంపరగాట పాక కళ పేరుతో వివిధ రాష్ట్రాలకు చెందిన వందల వంటలను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో 104 వంటకాలను, 104 మంది విద్యార్థులు విద్యార్థులు తయారు చేశారు. పూర్వీకుల మాదిరి కేవలం కట్టెల పొయ్యి, పొట్టు పొయ్యి, మట్టి పోయిలతో వంట చేశారు. ఇలా ఇప్పటి వరకు ప్రపంచంలో ఒకేసారి వందకు పైగా ఏకకాలంలో వందమందికి పైగా వంటకాలను చేయలేదని కలినరీ అకాడమీ ఆఫ్ ఇండియా చైర్మన్ సుధాకర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాలకు చెందిన చెఫ్ మాస్టర్స్‌తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.